## జర్నలిస్ట్ సురేశ్‌రెడ్డికి జడ్పీ మాజీ చైర్మన్ నివాళి



సురేశ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, జర్నలిస్టులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : భువనగిరి పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఏనుగు సురేశ్‌రెడ్డి సంతాప సభను పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సురేశ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పట్టణంలోని జర్నలిస్టులు సురేశ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, నాయకులు కుమార్, వెంకటేశ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## 'పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి'



నూతన పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం నాయకులు

రామన్నపేట, డిసెంబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం నాన్చివేత ధోరణి వీడి పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలని, సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పెన్షనర్స్ డే సందర్భంగా మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులకు సన్మానం చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిరసనలు, ధర్నాలకు సిద్ధం కావాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంగుల రాంరెడ్డి, గోదాసు అంజయ్య, కోశాధికారి తాటికొండ సూర్యనారాయణ, నాయకులు గోవర్ధనాచారి, కూనూరు సుదర్శన్, వనం అంజయ్య, మల్లికార్జున్, పుష్పకళ, జయలక్ష్మి పాల్గొన్నారు.

## 'సిమెంట్ ఫ్యాక్టరీ రద్దు ప్రకటన చేయాలి'



మాట్లాడుతున్న పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు

రామన్నపేట, డిసెంబర్ 30 : మండల కేంద్రంలో ఏర్పాటు చేయతలపెట్టిన అదానీ గ్రూప్ అంబుజా సిమెంట్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కో కన్వీనర్ ఎండీ రేహాన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన పర్యావరణ పరిరక్షణ వేదిక సమావేశంలో వారు మాట్లాడారు. అంబుజా సిమెంట్ రద్దు ప్రకటన వచ్చేవరకు ప్రతిపాదిత స్థలంలో ఎటువంటి పనులు చేసినా అడ్డుకుంటామన్నారు. త్వరలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోదాసు పృథ్వీరాజ్, ఎర్ర రమేశ్, మిర్జా ఫజల్‌బేగ్, ఎండీ జమీరొద్దీన్, బావండ్లపల్లి బాలరాజు, ఎండీ నాసర్ పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశిన బ్రేక్ దర్శనాలు నిలిపివేత

యాదగిరిగుట్ట, డిసెంబర్ 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి రోజున బ్రేక్ దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున 5:10 గంటలకు ఉత్తర ద్వారం గుండా స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తామని పేర్కొన్నారు. నిత్యన్నదానం విరాళాలు అందజేసే భక్తుల పుట్టిన రోజుతోపాటు ఇతర శుభకార్యాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి సంకల్పం చేయనున్నట్లు వెల్లడించారు. జనవరి 1న స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో రానున్నందున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. విమాన గోపురం స్వర్ణతాపడం విరాళాల పూర్తి వివరాలను త్వరలో అందజేస్తామని తెలిపారు.

బంగారం తాపడానికి విరాళాలు అందజేయాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## సమస్యలు పరిష్కరించాలని తాసీల్దార్‌కు వినతి




తాసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 30 : మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం తాసీల్దార్ మామిడి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చునగోని గాలయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలోని మేళ్లచెర్వు తండా, నేల్దంపాడు ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం లేక రైతులు, గిరిజన తండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తారు రోడ్డు నిర్మించాలని, పాత తాసీల్దార్ కార్యాలయం స్థలం కబ్జాకు గురవుతుందని, దాన్ని మినీ ఫంక్షన్ హాల్‌గా మార్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, యాదయ్య, మల్లారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ ఇండ్ల ఇనుప, కర్ర పనులు స్థానికులకు ఇవ్వాలి'

రామన్నపేట, డిసెంబర్ 30 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇనుప, కర్ర పనులు స్థానిక తయారీదారులకు ఇవ్వాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వరాచారి, మండలాధ్యక్షుడు మారోజు అనంతాచారి కోరారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన విశ్వబ్రాహ్మణుల మండల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఇనుముతో లేదా కర్రతో చేయబడిన దర్వాజలు, కిటికీలు తదితర పనులను స్థానిక తయారీదారులకు అప్పగించాలన్నారు. స్థానికులకు ఇస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని తెలిపారు. సమావేశంలో శ్రీనివాసాచారి, వెంకన్న, ప్రభాకరాచారి, రాఘవాచారి, శ్రవణ్, ఉదయ్, రామకృష్ణ, వెంకటాచారి, ఉపేంద్రాచారి పాల్గొన్నారు.

## భూగర్భ జలవనరులపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి జ్యోతికుమార్

బొమ్మలరామారం, డిసెంబర్ 30 : భూగర్భ జల వనరులపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి జ్యోతికుమార్ అన్నారు. జిల్లా భూగర్భ జలవనరుల శాఖ, మార్పు సొసైటీ ఆధ్వర్యంలో మల్యాల గ్రామంలోని రైతు వేదికలో రైతులకు భూగర్భ జలాల లభ్యత, నిర్వహణ మరియు అభివృద్ధిపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పెరుగుదలకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీటి కాలుష్యం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మానవ జీవితాన్ని జల వనరులు అధిక ప్రభావితం చేస్తాయని, వాటి పరిరక్షణకు మొదటి ప్రాధన్యత ఇవ్వాలని అన్నారు. ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## 'ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి'

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న అన్నారు. ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమం జయప్రదం కోసం పల్లె పల్లెనా కవులు, కళాకారులు, ప్రజలను సమాయత్తం చేయడంలో భాగంగా సోమవారం పట్టణంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఎమ్మార్పీఎస్, ఏఎస్పీ, కవులు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ మహాప్రదర్శన చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, బట్టు రామచంద్రయ్య, రవివర్ధన్, బర్రె జహంగీర్, యాతాకుల రాజన్న, బకరం శ్రీనివాస్, ఇరిగి శ్రీశైలం పాల్గొన్నారు.

## విమాన గోపురం స్వర్ణతాపడం విరాళాల లెక్కలు తేల్చాలి

- బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, డిసెంబర్ 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దివ్య విమాన గోపురం స్వర్ణతాపడానికి గత ప్రభుత్వ హయాంతోపాటు ప్రస్తుతం సేకరించిన విరాళాలపై పారదర్శకంగా లెక్కలు చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య డిమాండ్ చేశారు. బంగారాన్ని స్వాహా చేయాలని ఆలయ ఈఓ చూస్తున్నారని తమకు అనుమానం కలుగుతుందన్నారు. యాదగిరిగుట్టలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు బంగారం తాపడానికి ఎవరెవరు ఎంత విరాళం ఇచ్చారో పూర్తి వివరాలను వెల్లడించాలన్నారు. 125 కిలోల బంగారంతో విమాన గోపురం స్వర్ణమయం చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పించారని, ఇందులో ప్రజలను భాగస్వామ్యం చేసి విరాళాలు సేకరించాలని ప్రకటన చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదన్నారు. చెక్కుచెదరకుండా ఉండాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ 125 కిలోల బంగారంతో నిర్మించాలని భావిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం 60 కేజీల బంగారంతో స్వర్ణతాడపం పనులు చేపట్టి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని తాజా ప్రభుత్వం చూస్తుంటే.. ఇందుకు ఆలయ ఈఓ వత్తాసు పలుకుతున్నారని అన్నారు. గతంలో కేసీఆర్ దంపతులు కిలో 16 తులాలు, మాజీ మంత్రులు మల్లారెడ్డి రూ.1.50 కోట్లు, సత్యవతి రాథోడ్ నిలువు దొపిడీతోపాటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చాలా మంది పెద్ద ఎత్తున విరాళాలు అందజేశారని తెలిపారు. గతంలోనే దాదాపు 70కిలోల కంటే ఎక్కువ బంగారం సమకూరిందన్నారు. సేకరించిన బంగారం ఎక్కడికి పోయిందో ఆలయ ఈఓ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవస్థానానికి ఈఓగా ఉండాల్సిన భాస్కర్‌రావు.. కాంగ్రెస్ పార్టీకి పీఏగా మారాడని ఆరోపించారు. సంప్రదాయ వస్త్రాలతో స్వామివారి దర్శనానికి రావాలని తెలిపిన ఆయన.. టీ షర్టు, ట్రాక్ పాయింట్‌తో ఆలయంలోకి వెళ్లడం పట్ల భక్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారని అన్నారు. స్వామివారిని దర్శించుకునే ప్రతి ఒక్కరినీ ఒకేలా చూడాలని హితవు పలికారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, జిల్లా నాయకులు మిట్ట వెంకటయ్య, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య



భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 30 : మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలతో మనస్థాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలం వాయిల్లపల్లి జనగామకు చెందిన నర్ర నాగరాజు కంప్రెషర్ పని నిమిత్తం 13 సంవత్సరాల క్రితం పోచంపల్లి మండలంలోని దేశ్‌ముఖి గ్రామానికి వచ్చాడు. ఏడేండ్ల క్రితం నర్ర మాధవి(23)తో వివాహం జరిగింది. వారికి రెండేండ్ల బాబు, 10 నెలల కుమారుడు ఉన్నారు. కాగా, ఇంట్లో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మనస్థాపం చెందిన మాధవి సోమవారం మధ్యాహ్నం సమయంలో భర్త, అత్త కూలి పనికి వెళ్లగా.. ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బయట ఆడుకుంటున్న బాబు గమనించి సమీపంలోని మామకు చెప్పాడు. ఇరుగుపొరుగు వారు గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా.. మాధవి దూలానికి వేలాడుతూ కనిపించింది. ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సంతకం ఫోర్జరీ చేసిన ఇద్దరికి రిమాండ్

చౌటుప్పల్, డిసెంబర్ 30 : తన భూమికి రోడ్డు ఉన్నదని అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఘటనలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సుర్కంటి మహేందర్‌రెడ్డి పట్టణంలో ఉన్న తన 22.17 గుంటల భూమికి 40 అడుగుల రోడ్డు ఉన్నదని మండలంలోని ఎస్.లింగోటం గ్రామానికి చెందిన ఆకుల శ్రీకాంత్, తాళ్లసింగారం గ్రామానికి చెందిన సుర్వి అంజయ్యతో కుమ్మక్కై నకిలీ పత్రాలను సృష్టించారు. దీంతో అప్పటి పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడంతో విషయం బయటకు వచ్చింది. నిందితులు మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించగా, సుర్వి అంజయ్య పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

## ఆలేరులో విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఆలేరు టౌన్, డిసెంబర్ 30 : పట్టణంలో యాదగిరిగుట్ట సర్కిల్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం రాత్రి విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రహదారిపై ఇష్టారాజ్యంగా తోపుడు బండ్లపై వ్యాపారం నిర్వహిస్తున్న పది మందికి జరిమానా విధించారు. రహదారుల పక్కన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న వారికి మొదటి హెచ్చరికగా కౌన్సిలింగ్ ఇచ్చారు. డిసెంబర్ 31న మద్యం తాగి బండి నడిపితే, రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలపై తిరిగితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ట్రాఫిక్ సీఐ వై.కృష్ణ హెచ్చరించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అర్ధరాత్రి 12తర్వాత మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎంతటివారైనా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ కృష్ణయ్య అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీస్ సిబ్బందిని ఐదు బృందాలుగా ఏర్పాటు చేసి మండల కేంద్రంతోపాటు ప్రతి గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈవెంట్ కోసం ముందుగా అనుమతులు తీసుకోవాలని, డీజేలకు అనుమతులు లేవని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సైనిక కళాశాలను బీబీనగర్‌లోనే కొనసాగించాలి : బీఆర్ఎస్వీ



బీబీనగర్ : కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

బీబీనగర్, డిసెంబర్ 30 : మండలంలోని రాఘువాపురం గ్రామంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక మహిళా కళాశాలను బీబీనగర్ మండలంలోనే కొనసాగించాలని బీఆర్ఎస్వీ నాయకులు సోమవారం కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సైనిక కళాశాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు మంచి విద్యతోపాటు సైనిక శిక్షణ ఇచ్చేదన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ మంచి గుర్తింపు సాధిస్తున్నారని తెలిపారు. ఏడేండ్లుగా మండలంలో ఉన్న కళాశాలను ఇక్కడి నుంచి తరలించడం సరికాదన్నారు. కళాశాలను మండలంలోనే కొనసాగించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్, మండలాధ్యక్షుడు పచ్చిమట్ల వంశీగౌడ్, కంకల మహేశ్ పాల్గొన్నారు.

### ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

భువనగిరి కలెక్టరేట్ : బీబీనగర్ మండలం రాఘవపురంలో గల మహిళా డిగ్రీ కళాశాలను యథావిధిగా కొనసాగించి, నూతన భవనం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు కోరారు. ప్రజావాణిలో కలెక్టర్ హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు భవానిశంకర్, పట్టణ నాయకులు సతీశ్ పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి

- మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

మోత్కూరు, డిసెంబర్ 30 : రైతుల శ్రేయస్సు కోసం రైతు సేవా సహకార సంఘాలు నిరంతరం పని చేస్తున్నాయని, వాటి సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు అన్నారు. సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 26వ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘంలో రుణమాఫీ పొందిన 284 మంది రైతులకు రూ.2.30కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 210 మంది రైతులకు రూ.1.70కోట్ల కొత్త రుణాలు ఇచ్చామన్నారు. గతంలో దీర్ఘకాలిక రుణాలు పొంది వాయిదా మీరిన రైతులు ఓటీఎస్ పొందడం కోసం, రుణామాఫీ కాని రైతులకు రుణాలు మాఫీ చేయాలని డీసీఓ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు సామ పద్మారెడ్డి, పురుగుల మల్లయ్య, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, లక్ష్మయ్య, సీఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

## వరంగల్ హైవేపై అండర్‌పాస్ ఏర్పాటు చేయాలి : సీపీఎం




ఐటీఐ వద్ద అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని నిరసన దీక్ష చేస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 30 : పట్టణ పరిధిలోని వరంగల్ – హైదరాబాద్ హైవేపై ప్రభుత్వ ఐటీఐ సమీపంలో అండర్ పాస్ ఏర్పాటు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ ఐటీఐ సమీపంలోని రోడ్డు మార్గం నుంచి నాలుగు మండలాలకు సంబంధించిన సుమారు 40 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారన్నారు. ఈ మార్గంలో అండర్ పాస్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అండర్ పాస్ ఏర్పాటు చేయాలని, లేదంటే వేలాది మందితో హైవేను దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, నాయకులు పల్లెర్ల అంజయ్య, సిలివేరు ఎల్లయ్య, సిద్దారెడ్డి, యాదగిరి, కంచి మల్లయ్య, మాయ కృష్ణ, ఎదునూరి మల్లేశం, అశోక్, ఎల్లయ్య, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి లింగారెడ్డి



గుండాల : మోడల్ స్కూల్‌లో కూరగాయలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి లింగారెడ్డి

గుండాల, డిసెంబర్ 30 : విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి, తాసీల్దార్ జల కుమారి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు పాఠశాలల్లో మండల స్థాయి అధికారులు సోమవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను పెసరు లింగారెడ్డి, సుద్దాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాసీల్దార్ జల కుమారి మధ్యాహ్న భోజనం తయారీని, సరుకులను పరిశీలించి ఉపాధ్యాయులకు, వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

### కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను కొరటికల్ పల్లె దవాఖాన వైద్యాధికారి దివ్య, కప్రాయపల్లి ఆరోగ్య ఉప కేంద్రం వైద్యాధికారి వాణి, సూపర్‌వైజర్ మరియమ్మ, ఏఎన్ఎం కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. వారు విద్యార్థులతో కలిసి భోజనం చేయకుండా వేరే గదిలో కూర్చొని తిని కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేశారు.

వలిగొండ : మండలంలోని అరూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో సరుకులు, రిజిష్టర్, ఆహార పదార్థాలను పరిశీలించారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ రాములునాయక్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రామన్నపేట : మండలంలోని జనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని సూచించారు.

యాదగిరిగుట్ట : మండలంలోని మల్లాపురం ప్రాథమిక పాఠశాలలో మండల వ్యవసాయాధికారి సుధారాణి మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలు, బియ్యం పరిశీలన చేసి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఆలేరు టౌన్ : ఆలేరు జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలను తాసీల్దార్ అంజిరెడ్డి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కాంట్రాక్టర్‌కు, ఉపాధ్యాయులకు సూచించారు.

రాజాపేట : మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌సుందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో స్థానిక వైద్యాధికారి భరత్ అందిస్తున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వంట సామగ్రి, ఆహార పదార్థాలను పరిశీలించారు.

## ప్రజావాణి సమస్యలపై అలసత్వం వహిస్తే చర్యలు

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 30 : ప్రజావాణి సమస్యలపై అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో 57 అర్జీలను స్వీకరించామని, అందులో రెవెన్యూ శాఖకు–35, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు – 5, మున్సిపాలిటీకి – 4, సంక్షేమ శాఖకు – 3, జిల్లా పంచాయతీ రాజ్ శాఖకు–3, హౌసింగ్‌కు–2, ల్యాండ్ సర్వేకు–2, జిల్లా సాంఘిక సంక్షేమం, పోలీస్, విద్యా శాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అదాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని వినతి

వలిగొండ, డిసెంబర్ 30 : మండలంలోని లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థినులపై దాడిచేసి గాయపరిచిన ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతల శివ మాట్లాడుతూ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇటీవల పాఠశాల విద్యార్థినులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, నాయకులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్, సతీశ్, భవానిశంకర్ పాల్గొన్నారు.

## నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు

- జిల్లా బీసీ సంక్షేమాధికారి యాదయ్య



మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్న నేలపై కూర్చొని భోజనం తింటున్న విద్యార్థులు

మోత్కూరు, డిసెంబర్ 30 : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా బీసీ సంక్షేమాధికారి, మండల ప్రత్యేకాధికారి బి.యాదయ్య హెచ్చరించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామ, మండల ప్రత్యేకాధికారులు సోమవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పాటిమట్ల పాఠశాలలో ఎంపీడీఓ బాలాజీ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నేలపై అపరిశుభ్రంగా ఉన్న వాతావరణంలో చెట్ల కింద కూర్చోబెట్టి విద్యార్థులకు భోజనం వడ్డించారు. మీరు వచ్చినప్పుడే భోజనం, కూరగాయలు బాగుంటున్నాయని, మిగతా రోజుల్లో బాగుండడం లేదని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వంట ఏజెన్సీలు నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ గోపాల్‌రెడ్డిని ఆదేశించారు.

## ఎంపీ ఈటలను కలిసిన ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు



ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు

చౌటుప్పల్, డిసెంబర్ 30 : ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల ప్రకటించిన నార్త్ టెండర్ల ప్రక్రియ ఆశాస్త్రీయమని, భూములు ఇవ్వడానికి రైతులు సిద్ధంగా లేరని విన్నవించారు. భూ సేకరణ 94శాతం పూర్తయిందని కేంద్రానికి రాష్ట్రం ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ట్రిపుల్ ఆర్‌పై కమిషన్ వేసి నిజానిజాలను తేల్చాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో భూ నిర్వాసితుల సంఘం కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, నిర్వాసితులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దబ్బేటి రాములు గౌడ్, మారుపాక లింగంగౌడ్, సందగళ్ల మల్లేశ్‌గౌడ్, జాల వెంకటేశ్ యాదవ్, జాల శ్రీశైలం యాదవ్ ఉన్నారు.

## రాఘవాభారతి గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



రాఘవాభారతి గ్రంథాలయ అధ్యక్షుడు రమేశ్‌కు పుస్తకాలు అందజేస్తున్న బుక్ ఫెయిర్ నిర్వాహకులు

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 30 : మండలంలోని రాఘవాపురంలో ఏర్పాటు చేసిన రాఘవాభారతి గ్రంథాలయానికి హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో గత 10రోజులుగా నిర్వహిస్తున్న బుక్ ఫెయిర్‌లో గ్రామీణ గ్రంథాలయాల కోసం సేకరించిన రూ.25వేల విలువైన పుస్తకాలను గ్రంథాలయ అధ్యక్షుడు రమేశ్‌కు బుక్ ఫెయిర్ నిర్వాహకులు సోమవారం వివిధ రకాల పుస్తకాలు అందజేశారు. బుక్ ఫెయిర్ నిర్వాహకులకు గ్రంథాలయ అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బుక్ ఫెయిర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యాకూబ్, వాసు, కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రావు పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆలేరు రూరల్, డిసెంబర్ 30 : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారులు జయంత్‌కుమార్, అనూష అన్నారు. మండలంలోని కొలనుపాక జడ్పీహెచ్ఎస్‌లో రాష్ట్రీయ బాల స్వస్తియా ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల వేణుగోపాల్, ఉపాధ్యాయులు శ్రీధర్, రవీందర్, లక్ష్మణ్ ఉన్నారు.

## రైస్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

రామన్నపేట, డిసెంబర్ 30 : కొమ్మాయిగూడెం నుంచి చిట్యాల వెళ్లే మార్గాన్ని కబ్జా చేసి మురుగు, వ్యర్థ రసాయనాలతో పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తున్న హరిహర పుత్ర రైస్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య అన్నారు. రైస్ మిల్లు వెనుక భాగంలో ఉన్న చిట్యాల – కొమ్మాయిగూడెం దారిని సీపీఎం నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దారి గుండా తరతరలుగా రైతులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఎవరికీ తెలియకుండా భూమి రిజిస్ట్రేషన్ ఉందంటూ దారిని మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యర్థ రసాయనాలను బయట వదలడంతో భూగర్భ జలాలు కాలుష్యమవుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శానగొండ వెంకటేశ్వర్లు, ఎర్ర కాటమయ్య, బెల్లి మల్లయ్య, సత్తయ్య, నాగయ్య, మల్లేశం, నరేశ్, శ్రీనురెడ్డి పాల్గొన్నారు.